31న ఎఎఫ్‌యులో రెండో విడత ప్రవేశాలు

కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ(వైఎస్ఆర్ ఎఎఫ్ఎయు)లో ఈనెల 31న రెండో విడత ప్రవేశాల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఏడీసెట్-2023 కమిటీ ఛైర్మన్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరం సంబంధించి బిఎఫ్ఎ పెయింటింగ్, శిల్పం, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి తొలి విడతలో హాజరు కాలేని విద్యార్థుల సౌకర్యార్థం రెండో విడత ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాలు పొందే అభ్యర్థులు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండుసెట్ల జిరాక్స్ ప్రతులు, 6 పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, నిర్ణీత ఫీజుతో హాజరుకావాలని సూచించారు.

'ఉక్కు' ఆశలపై నీళ్లు!

- కేంద్రంలోని బిజెపి సర్కారు ఝలక్
- రాష్ట్రానికి మరో 'సారీ' మొండిచేయి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ బుట్టదాఖలైంది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యుపిఎ-2 సర్కారు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పలు రకాల సర్వేలు, టాస్క్ ఫోర్స్‌ల పేరుతో అధ్యయ నాలు చేయించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం పార్లమెంటులో టిడిపికి చెందిన ఇద్దరు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి నిత్యానందరాయ్ సర్వే సంస్థలు లాభసాటి కాదని తేల్చాయని, ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం కుదరదని కుండబద్దలు కొట్టినట్లు సమాధానం చెప్పడం విస్మయాన్ని కలిగించింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ప్రయివేటు రంగంలో బ్రహ్మణీ పేరుతో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు 20 నుంచి 40 శాతం మేరకు పనులు పూర్తి చేశారు. 2009 అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ఆర్ మృతి చెందారు. వివిధ రకాల కారణాలతో బ్రహ్మణీ ఉక్కు పరిశ్రమ నిర్మాణం నిలిచిపోయింది. రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు మారడంతో బ్రహ్మణీ పరిశ్రమ కథ కంచికి చేరింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర విభజన హామీలు, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రధానాంశాలుగా మారడం తెలిసిందే. అప్పటి టిడిపి సర్కారు నిర్లక్ష్యం వెరసి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసిపి సర్కారు అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ ఉక్కు దిగ్గజ సంస్థ జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర హోంశాఖా సహాయమంత్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దేశంలోని ప్రయివేటు, కార్పొరేట్లకు లాభసాటిగా కనిపించిన ఇనుప ఖనిజం ఎగుమతులు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన సెయిల్‌కు ఎందుకు లాభసాటిగా కనిపించడం లేదనే చర్చ నడుస్తోంది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రాష్ట్రంపై చిన్నచూపు చూస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహపూరిత వైఖరి పట్ల ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

'మణిపూర్' దోషులను శిక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.ఎ.మనోహర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిఅన్వేష్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఐ ఎన్ సుబ్బమ్మ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో నాగా, కుకి ఆదివాసిలపై జరుగుతున్న మారణహోమాన్ని ఆపాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రం మూడు నెలలుగా అగ్నిగుండంగా మారడానికి కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వమే కారణమని అన్నారు. మోదీ ప్రభుత్వం అధికారాన్ని దక్కించు కోవడానికి, పాలనను సుస్థిరం చేసుకోవడానికే నరమేధం చేస్తుందన్నారు. 2002లో గుజరాత్ మారణకాండను సృష్టించిన మోదీ, అమిత్‌షా లే మణిపూర్ రాష్ట్రానికి చిచ్చు పెట్టారని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న మెయితీలకు ఎస్‌టి హోదాను కల్పించడాన్ని నాగా, కుకి ఆదివాసి తెగలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. తమకు ఉన్న అవకాశాలను కోల్పోతామని భావిస్తున్నారని అన్నారు. మెయితీలకు, ఆది వాసీ తెగలకు మధ్య అగ్గి రాజేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పబ్బం గడుపుకొంటున్నాయని ఎద్దేవా చేశారు. మే4న వందల మంది దుండగుల గుంపు ఇద్దరు కుకి మహిళలను వివస్త్రను చేసి, నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసిన ఘటన దేశానికే మాయని మచ్చని అన్నారు. అందులోని ఒక మహిళకు చెందిన తండ్రిని, తమ్ముడిని కిరాతకంగా హత్య చేశారని అన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ సంఘటనలు జరగడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఈ సంఘటన చోటు చేసుకున్న 80 రోజుల కు కేవలం ఆరుగురిని అరెస్టు చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. ఈ అమానవీయ సంఘటన పట్ల సుప్రీం కోర్టు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలు జారిచేయడమే కాక తామే రంగంలోకి దిగుతామని ప్రకటించిందని తెలిపారు. ఈ మూడు నెలల కాలంలో 164 మంది చనిపో యారని, 300కు పైగా చర్చిలు నేలమట్టం చేశారని ప్రభుత్వ అధికారిక లెక్కలే చెబుతున్నాయని వాపోయారు. మణిపూర్ రాష్ట్రం తగలబడుతుంటే గిరిజన మహిళ ముర్ము రాష్ట్రపతిగా ఉండి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సంఘటనకు భాద్యత వహిస్తూ ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని భర్త్ రఫ్ చేయాలని చేయాలని, మహిళలపై జరుగుతున్న, అత్యాచారాలను, హత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, ఎం. వి. సుబ్బారెడ్డి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, నగర సిఐటియు అధ్యక్షులు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి మహిళా సంఘం నాయకులు జమీల డివైఎఫ్ఐ నగర నాయకులు విజయ్, ఉదయ్ తో పాటు ఆటో వర్కర్స్ యూని యన్ నాయకులు పాల్గొన్నారు.

కడప పాతబస్టాండ్ వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మారణకాండ మానవత్వానికి మచ్చ : యుటిఎఫ్

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో అల్లర్లు, ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న మారణకాండను యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధానకార్యదర్శి పాళెం మహేష్ బాబు ఖండించారు. మంగళవారం సాయంత్రం కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లర్లను నిలుపుదల చేయాల్సిన మణిపూర్ రాష్ట్ర ముఖ్య మంత్రి బీరేన్ సింగ్ వాటిని ప్రోత్సహిస్తూ జాతుల మధ్య ఘర్షణలు పెంచారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్ మారణకాండకు ముగింపు పలకాలని కోరారు. లేనిపక్షంలో మణిపూర్ బాధితుల పక్షాన ఎంతటి పోరాటాల కైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, సరస్వతి, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మధుసూదన, యుటిఎఫ్ నాయకులు మజ్జారి చెన్నకేశవులు, చంద్రశేఖర్, వీరనారాయణ, కిరణ్ కుమార్, కరీముల్లా, బాబు, జి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య భద్రత తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాలల్లో పిల్లలకు విద్య భోధనతో పాటు వారి ఆరోగ్య భద్రతను కూడా పర్యవేక్షించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాలులో అన్ని పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల ఆరోగ్యం, మనబడి "నాడు నేడు' ఫేస్-2 పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 అకడమిక్ క్యాలెండర్‌ను ఎంఇఒలు కచ్చితంగా అనుసరించాలన్నారు. ఈ విద్యాసంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలతో పాటు అన్ని తరగతుల ఆకాడమిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఏ పాఠశాలలో కూడా డ్రాప్ ఔట్స్ రికార్డ్ అనేది ఉండ కూడదు. స్కూల్ పిల్లలకు సిలబస్ ప్రకారం పాఠ్య అంశాలు భోధిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఆరాతీయాలని చెప్పారు. ఉపాధ్యాయుల సెలవుల విషయంలో పరిమితికి మించి అను మతివ్వ కూడదన్నారు. స్థానిక పిహెచ్‌సి వైద్యుల ద్వారా ప్రతి విద్యార్థికీ వైద్య పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహిం చాలన్నారు. రెండవ దశ నాడు-నేడు పనులకు సంబంధించి పాఠశాలల్లో ఇంక నూ ఏవైనా కొరత ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డివిఇఒ శ్రీనివాసులు రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన వికాస్ హరి

ప్రజాశక్తి - కడప

మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడును మంగళవారం కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయగిరిలో పార్టీ పరిస్థితులను వికాస్ హరికృష్ణ ఈ సందర్భంగా చంద్రబాబుకు వివరించారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ఉదయగిరిలో యువకులు, మహిళలు నిరాజనాలు పలికారని, నాయకు లందరూ సమన్వయంతో పాదయాత్ర దిగ్విజయం చేశారని తెలిపారు. ఉదయ గిరిలో కష్టపడి పనిచేయడంతో పాటు పార్టీ నాయకులందరితో సమన్వయం చేసుకొని పార్టీ పటిష్ఠతకు, బలోపేతానికి కృషి చేయాలని వికాస్ హరికి ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సూచించారు.

చంద్రబాబుతో మాట్లాడుతున్న వికాస్ హరికృష్ణ

ఆరోగ్యం మన చేతుల్లోనే

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మలేరియా జోనల్ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి, మంగళవారం స్థానిక పిహెచ్‌సిని ఆమె సందర్శించారు. రికార్డులను, ల్యాబరేటరీ, డెలవరీ రూములను, వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ లార్వా పెరగకుండా ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్య పంచాలని సూచించారు. రికార్డులు, పరిసరాలు సక్రమంగా ఉండడంతో డాక్టర్ రాఘవేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మోహన్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బాలాజీకి వైవీయూ డాక్టరేట్

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం కామర్స్ డిపార్ట్‌మెంట్ పరిశోధకులు డి.బాలాజీకి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. వాణిజ్య శాస్త్ర శాఖ ఆచార్యులు ఎస్. రఘునాథరెడ్డి పర్యవేక్షణలో 'ఫైనాన్షియల్ ఇన్డెబిటెడ్నెస్ అమాంగ్ అగ్రికల్చర్ ఫార్మర్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అనే అంశముపై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని బాలాజి విశ్వ విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధృవీకరించారు. ఈ మేరకు డాక్టరేట్ ప్రొసీడింగ్స్‌ను వై.వి.యు పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి జారీ చేశారు.

శిక్షణతో ఉపాధి అవకాశాలు

కడప : భారత త్రివిధ దళాలు ఆర్మీ , నేవీ, ఎయిర్‌ఫోర్సు విభాగాలు నిర్వహించే క్యాంపులలో ఎన్‌సిసి కేడెట్లు పాల్గొని శిక్షణ పొందడం ద్వారా ఆయా రంగాలలో ఉపాధిపై అవగాహన పెంచుకుని మంచి అవకాశాలను పొందవచ్చని ప్రభుత్వ పురుషుల కళాశాల(స్వయం ప్రతిపత్తి) ప్రధాన ఆచార్యులు డా. జి రవీంద్రనాథ్ అన్నారు. ఈనెల 14 నుంచి 23 వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపులో ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి కేడెట్లు హాజరై అద్భుత ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించారు. వారికి మంగళవారం ప్రిన్సిపల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు మెడల్స్ అందజేశారు కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు, లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, మహేష్, ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి కడప అర్బన్

మహిళల అభివృద్ధి చంద్రబాబు నాయుడతోతనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివకొండారెడ్డి, తెలుగు రైతు నాయకుడు లక్ష్మిరెడ్డి అన్నారు. అమీర్ బాబు నేతృత్వంలో మహిళల భవిష్యత్తుకు గ్యారెంటీ కారు ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళల పైన అత్యాచారాలు, మానభంగాలు, దళితులు, మైనారిటీలు, బీసీలు ఎంతోమంది బలి అయ్యారని చెప్పారు. అలాంటి వారి కుటుంబాలకు నారా చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని పేర్కొన్నారు. నాయకత్వాన్ని బలపరచి ముఖ్యమంత్రిగా చేస్తే రాబోయే టిడిపి ప్రభుత్వ హయాంలో తల్లికి వందనం పేరుతో ఎంతమంది చిన్నారులు ఉన్నా వారికి రూ.15వేలు ప్రతి ఏడాదీ తల్లుల అకౌంట్లో జమ చేస్తారని తెలిపారు. అలాగే 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1500 లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జలతోటి జయ కుమార్, కోమ్మలపాటి సుబ్బరాయుడు, కొండా సుబ్బయ్య, బండి జయశేఖర్, సానపరెడ్డి రవిశంకర్ రెడ్డి, గన్నిపాటి మల్లేష్, జియావుద్దీన్, భరత్, ఖాజాపూర్, శ్రీనివాసులు, ఆరిఫ్, ఓబుల రెడ్డి, సుధాకర్ యాదవ్, మేకల వెంకటెష్ యాదవ్, ప్రెమ్ కుమార్, తెలుగు మహిళా నాయకురాలు వరద పార్వతి, నిర్మలమ్మ, కళావతి, మీనాక్షి, స్వర్ణలత, మాలన్ బి పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

కడప అర్బన్ : గుణాత్మక విద్యను అందించడమే గురువు గురుతర బాధ్యత అని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల సముదాయ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఒక నిరంతర విద్యార్థి అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో విద్యావ్యవస్థలో నిరంతరం మార్పులు చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా మన పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు గుణాత్మక విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించే విధంగా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత పాఠశాల సముదాయ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సిఆర్ఎంటి) ఆదిమూలం శంకర్, పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి

వల్లూరు : ప్రతి ఉపాధ్యాయుడూ బోధనపై నైపుణ్యాలు పెంచుకొని విద్యార్థులకు మంచి విద్య అందించినప్పుడే ఉపాధ్యాయుడు విజయ వంతమైనట్లుగా భావించాలని వల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యా యుడు డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు సబ్జెక్టులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యా ర్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన అందించినప్పుడు విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగు తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిఆర్‌పి విశ్వనాథ్ పాల్గొన్నారు.

జగన్ సర్కార్‌కు పతనం తప్పదు : విద్యార్థి సంఘాలు

కడప అర్బన్ : విద్యార్థుల సమస్యలు పరిష్కరించుకుంటే జగన్ సర్కార్‌కు పతనం తప్పదని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యా సంస్థల బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు జి. సుధీర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఎం. బాబు, మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి శకుని మామ లాగా తయారయ్యాడని విమర్శించారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు తాండవిస్తున్న పాలక ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, అకిరానంద్, అశోక్, గోపి, నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ ఉద్యోగుల నిరసన

కడప : పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 27 నుంచి ఆగస్టు 10 వరకువివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణకు జిల్లా జెఎసి చైర్మన్ యు.ఎస్.కె. బర్నబాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. చాంద్ బాషా, కన్వీనర్ ఎం వి. చలపతి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 27, 28 తేదీలలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 31న మెమోరెండాలు అందజేత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 1న నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 2,3 తేదీలలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. 4,5,7 తేదీలలో వర్క్ టు రూల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8న విజయవాడలోని విద్యుత్ సౌధ వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 9న విద్యుత్ సంస్థ ఇచ్చిన సిమ్ కార్డులను తిరిగి యాజమాన్యానికి అందజేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 10న సమ్మె ఉంటుందని చెప్పారు.

విద్యుత్ ఎస్ఇకి సమ్మె నోటీసు ఇస్తున్న జెఎసి నాయకులు

విషాదం
అన్నాచెల్లెలును కాటేసిన పాము
అన్న మృతి, చెల్లి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. అన్నా చెల్లెలును పాము కాటు వేసింది. ఈ సంఘటనలో అన్న మృతి చెందాగా చెల్లెలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు, అనురాధ దంపతులకు కుమారుడు నవదీప్ (12), కుమార్తె భవ్యశ్రీ ఉన్నారు. మంగ ళవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న అన్నా చెల్లెలను పాము కాటేసింది. తల్లిద ండ్రులు, బంధువులు గుర్తించి ఇద్దరిని పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. నవదీప్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భవ్యశ్రీ పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు రెఫర్ చేశారు. అభంశుభం తెలియని చిన్నారులను పాము కాటేయడంతో అంకాలమ్మ గూడూరులో విషాదఛాయలు అలుము కున్నాయి. రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. చిన్నారుల తండ్రి రామాంజనేయులు తొండూరు పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు.

పాముకాటుకు గురై మృతిచెందిన నవదీప్

డిఇఒ అనుచిత ప్రవర్తనపై విచారించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

అనుచిత ప్రవర్తనలపై, అవినీతి, అక్రమాల ఆరోపణలపై జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని, లేకుంటే కలెక్టర్ తక్షణం విచారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. డిఇఒ అనుచిత ప్రవర్తనలపై, వారిపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులలో భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. వీటిపై డిఇఒ ఇంతవరకు బహిరంగంగా ఖండించలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎలాంటి ర్యాలీలలో, ధర్నాలలో పాల్గొనకూడదనే ఉత్తర్వులు జారీ చేయడం భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుందని అన్నారు. వివిధ పార్టీల ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతూ ఉంటాయని, అధికారులు మాత్రం 35 సంవత్సరాలు సర్వీసులో ఉంటారని, ప్రజా అనుకూల ప్రవర్తనతో ఉండాలని వారు గుర్తుచేశారు. అవినీతి ,అక్రమాల ఆరోపణలపై కలెక్టర్ విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో కలిసి వచ్చే పక్షాలను కలుపుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సుగాలి బిడికి అభివృద్ధికి కృషి : సాయినాథ్ శర్మ

చింతకొమ్మదిన్నె : మండలంలోని సుగాలి బిడికి గ్రాస్తులకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలుగు నాడు ప్రజా సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీ భట్ల సత్య సాయినాథ్ శర్మ పేర్కొన్నారు, మంగళవారం స్థానిక సుగాలి బిడికి మారమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. సుగాలి బిడికి గ్రామ మారమ్మ జాతరలో భాగంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు వచ్చారు. ఆయనకు గ్రామస్తులు బాణాసంచా పేల్చుతూ, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయినాథ్ శర్మ మాట్లాడుతూ మారమ్మ తల్లి అనుగ్రహంతో బిడికి గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాబు, రామాంజనేయులు, కిషోర్, దేవేంద్ర నాయక్, మల్లికార్జున నాయక్ నాగముని నాయక్ , మాజీ సర్పంచ్ శంకర్ నాయక్,రాజు నాయక్ భారీ సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

వివేకానందరెడ్డిది రాజకీయ హత్య కాదు

పోరుమామిళ్ల టౌన్ : మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య రాజకీయ హత్య కాదని, కేవలం ఆస్థితగాద హత్యే అని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.రోజూ ఎల్లో మీడియా, ఎల్లో పత్రికల్లో వైఎస్ అవినాష్ రెడ్డిని ప్రధాన ముద్దాయిగా చూపిస్తూ రకరకాల కథనాలతో ప్రజలను తప్పు దోవ పట్టించడం సరైందని కాదని పేర్కొన్నారు. వివేకా హత్య కేసులో సిబిఐ అధికారి రాంసింగ్ అన్ని కోణాల్లో విచారణ చేపట్టడం లేదని విమర్శించారు. హత్య చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరని హితవు పలికారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఔత్సాహికులైన వారికి ప్రోత్సాహం, అవకాశం ఇవ్వాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్, వై. సురేష్‌రెడ్డి, హౌసింగ్ డిఇలతో కలిసి కలెక్టర్ క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఆశాజనకంగా ఉండడంతో పాటు అధిక ఫలసాయం అందుతున్న అరటి, చీనీ, మామిడి, తదితర పండలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి స్థానిక వనరులతోనే నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల ఉత్పాదకతను పెంపొందించాలన్నారు. ఔత్సాహిక రైతు సంఘాల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు అందిన 60 దరఖాస్తులను బ్యాంకులకు సాంబిట్ చేశామని, ఇప్పటికే 40 యూనిట్లకు సంబంధించి గ్రౌండింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పులివెందుల ప్రాంతంలో అధిక ప్రాధాన్యత ఉన్న అరటి ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజీ యూనిట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలను కూడా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, కమిటీ సభ్యులు ఉద్యాన శాఖ జిల్లా అధికారి రాజీవ్ మైఖేల్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శారదమ్మ, ఫిషరీస్ డిడి నాగలింగేశ్వరాచారి, గిరిజన సంక్షేమ శాఖాధికారి డా. వెంకట సుబ్బయ్య, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్, ఎల్ డిఎం దుర్గా ప్రసాద్, ఎఫ్‌పిఒ ప్రతినిధి ఎం.బలరామిరెడ్డి, పులివెందుల ఎంపిడిఒ పాల్గొన్నారు.

రాళ్లను కరిగించే శక్తి సంగీతానికి ఉంది

ప్రజాశక్తి - కడప

రాళ్లను సైతం కరిగించగల శక్తి సంగీతానికి ఉందని, మానసిక రోగాలను సైతం నయం చేయ గలదని సంగీత దర్శకుడు, గాయకుడు ప్రిన్స్ వంజ అన్నారు. సిటీ కల్చరల్ సెంటర్ హైదరాబాద్‌లో స్మైయిల్ ఆత్మీయ స్వరాంజలి-2023 కార్యక్రమం సందర్భంగా మేస్ట్రో ఇళయరాజా, చక్రి సంగీత విభావరి, మ్యూజిక్ ట్రాక్స్ సారధులు జోగారావు, ఫనికిశోర్ నిర్వాహణలో నిర్వహించారు. కార్యక్రమానికి చక్రి సంగీత దర్శకత్వంలో ఎన్నో వైవిధ్యమైన పాటలు పాడిన గాయకుడు, సంగీత దర్శకుడు రవి వర్మ, సంగీత దర్శకుడు, గాయకుడు ప్రిన్స్ వంజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రపంచాన్ని తన సంగీతంతో మంత్రముగ్ధులను చేసిన స్వర మాత్రికుడు మేస్ట్రో ఇళయరాజా, యువతరాన్ని ఉర్రూతలూగించిన స్వర్గీయ చక్రి గార్ల మధురమైన పాటలను 30 మంది గాయకులు పాడి శ్రోతలను ఎంతగానో అలరించారు. అనతరం నిర్వాహకులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తరువాత గాయనీ గాయకులకు అతిథుల చేతుల మీదుగా మొమెంటోలను బహుకరించారు. కార్యక్రమంలో సీనియర్ గాయకులు రత్నమ్మ, కల్యాణి, గౌరీమనోహరి, మధుసూదన్, గోపికృష్ణ, ప్రేమ్, భూషణ్, టివి నటులు జోగారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంగీత దర్శకుడు, గాయకుడు ప్రిన్స్ వంజ

జిల్లా పర్యాటకానికి విస్తృత ప్రచారం

కడప అర్బన్ : జిల్లా పర్యాటకానికి ఇటీవల పలుమార్గాల ద్వారా విస్తృత ప్రచారం లభిస్తోందని ఇంటాక్ కన్వీనర్ కె. చిన్నప రెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా పర్యాటకంపై ఇంటర్న్‌షిప్ చేసిన పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు మంగళవారం స్థానిక మానస గ్రాండ్ ఇన్ హోటల్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను అందజేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నప రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గండికోటతో పాటు అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని చెప్పారు. 13 ఏళ్లుగా ఇంటాక్ ద్వారా, 6 ఏళ్లుగా రాయలసీమ టూరిజం సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పర్యాటకంపై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. సభాధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జలంధర్ ఇంజనీరింగ్ విద్యార్థులు జశ్వంత్ రెడ్డి, జుబేర్ అహ్మద్, దినేష్ కుమార్, ముస్తఫీజుల్లా ఖాన్ ఇంటర్న్‌షిప్ చేయడంతో ఉత్తర భారత ప్రాంతాలలోనూ మన పర్యాటక ప్రాంతాల గురించి ప్రచారం లభించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆగస్టు 6న నిర్వహించబోయే చేనేత దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయలసీమ సమగ్రాభివృద్ధి సాధనకు 'చలో ఢిల్లీ'

ప్రజాశక్తి - చాపాడు

రాయలసీమ హక్కుల సాధనకు రాయలసీమ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో ఈనెల 28న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాపక్షం కన్వీనర్ గోశెట్టి వెంకటరమణయ్య పిలుపునిచ్చారు. మైదుకూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా సీమకు రావలసిన నిధులు, నికర జలాలు లభ్యం కాలేదన్నారు. రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ఎలాంటి పరిశ్రమలు రాలేదన్నారు. జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాన ఉందన్నారు. ప్రాజెక్టులు పూర్తి కాకపోగా వీటి అనుసంధాన కాలువలు ఒక్కటీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్.శ్రీనివాసులురెడ్డి, కె.నారాయణరెడ్డి, బంగారు కొండయ్య, పి.శేషయ్య, జి.రాఘవేంద్ర, జి.పెద్ద నరసింహులు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులందరికీ నేతన్న నేస్తం ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అర్హులైన ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివనారాయణ కోరారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు నేతన్న నేస్తం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. అయితే అదే తరుణంలో షరతులు ద్వారా, కరెంటు యూనిట్ల ద్వారా, ఇతర కారణాల చేత నేతన్న నేస్తంకు అనర్హులుగా గుర్తిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ గత ఎన్నికల ప్రచారంలో అందరికీ నేతన్న నేస్తం ఇస్తామన్నారు. కానీ ఇప్పుడు రోజురోజుకు ప్రతి విడతలో అర్హులు తగ్గుతూ వస్తున్నారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో మోరగుడి, దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం గ్రామాల్లో ఎక్కువ భాగం మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వీరిని దృష్టిలో పెట్టుకుని బేషరతుగా నేతన్న నేస్తం అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం నేతన్న నేస్తం అర్హుల జాబి తాలో ఉన్నా, డబ్బులు బ్యాంక్ ఖాతాలో పడలేదన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సంజీవ రాయుడు, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివనారాయణ

నేడు దేవాదాయ శాఖ భూములకు వేలం

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులో ప్రొద్దుటూరుకు చెందిన నారాయణ రంగయ్యగారి సత్రానికి సంబంధించిన భూములు కౌలుకు ఇచ్చేందుకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఇఒ రామచంద్రాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్లు 53-3ఏ, 37, 79లోని 11.28 ఎకరాలకు సంబంధించి ఒక ఏడాదికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందస్తుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. వేలంపాట ప్రొద్దుటూరు కార్యాలయంలో ఉంటుందని ఆయన వివరించారు.

మురుగు కాలువలో పూడిక తీయాలని వినతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద మురికి కాలువతో గ్రామస్తులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అందులో పూడిక తీయాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘు రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల వద్ద అంబేద్కర్ నగర్, రవీంద్రనగర్, కంది మల్లయ్యపల్లిలో 600 కుటుంబాలున్నాయని తెలిపారు. ప్రధానమైన మురికి కాలువ అక్కడ ఉందన్నారు. మురికి కాలువ ఇరుకుగా ఉండడంతో మొత్తం నీళ్లు పొర్లి ఇళ్ల ముందుకు నిరంతరం ప్రవహిస్తున్నాయని వివరించారు. ఈ ప్రాంతంలో తిరగాలంటే ముక్కు మూసుకునే పరిస్థితి అన్నారు. ఈ కాలువను ఎత్తు పెంచాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి సునీల్ కుమార్, కార్యకర్తలు ఎద్దు రాహుల్, భాస్కర్, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

సామాజిక అంశాలను యువత మరచిపోవద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉండడంతో అశ్లీలం విలయతాండవం చేస్తోందని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రొద్దుటూరు శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. కార్యాలయంలో ఈ-ఎథిక్స్ వీక్ గోడపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు హనీఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తనకుతానుగా ప్రశ్నించుకోవాలన్నారు. నిరంతరం అశ్లీలాన్ని చూడడం, కంప్యూటర్ సెల్ఫోన్ ముందు గంటలకొద్దీ కూర్చోవడం వల్ల అన్ని అనర్థాలు జరగుతాయన్నారు. అంతర్జాలంలో పెరిగే స్నేహాలతో మంచి సంబంధబాంధవ్యాలు తగ్గిపోతున్నాయన్నారు. సామాజిక అంశాలను యువత మరచిపోతోందన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఏజాజ్, ఆదిల్, ముసన్విర్, జుహైర్, అనస్ పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలి

పులివెందుల రూరల్ : జగనన్న మహిళా మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలని మెప్మా పీడీ సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక బిఎస్ఎన్ఎల్ వద్ద జగనన్న మహిళా మార్టును ఏర్పాటు చేశారన్నారు. మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న మహిళామార్ట్‌లో బయట మార్కెట్ కంటే తక్కు వ ధరకు దొరికే నిత్యసరుకులు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ ఈ మార్ట్‌లో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసేలా అవగాహన కల్పిం చాల న్నారు. మెప్మా డీపీఎం నాగరాజు, సివోలు నాయుడు, నాగన్న, హరిత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ నాటికి పూర్తవ్వాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కమిషనర్ వివి నరసింహారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇటుకుల తయారీని పరిశీలించారు. క్యూరింగ్ బాగా చేయించాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలను క్రమశిక్షణతో వినాలి

పులివెందుల రూరల్ : విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుజాత, ఆర్.సి.యం చర్చి ఫాదర్ ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రత్యేక మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు పెద్దల పట్ల ప్రేమానురాగాలు, గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ ప్రశాంతి కరస్పాండెంట్, టీచర్ అనూష, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

పనిచేయని ఆర్ఒ ప్లాంట్లు

తరచూ మరమ్మతులు - తాగునీటికి విద్యార్థుల పాట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్లు కొద్ది రోజుల నుంచి పని చేయడం లేదు. దీంతో విద్యార్థులకు తాగునీటి తిప్పలు తప్పడంలేదు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా కోట్లాది రూపాయలతో జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలను అతి సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఒక్కో పాఠశాలలో దాదాపు రూ.30 లక్షలతో ఫిల్టర్ నీటిని అందివ్వాలనే ఉద్దేశంతో బాలికల, బాలుర పాఠశాలల్లో వేర్వేరుగా ఆర్ఒ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటగా మారిందనే విమర్శలున్నాయి. ఆయా పాఠశాలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే స్వయంగా ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అదే రోజు ఆర్ఒ ప్లాంట్లను కూడా సిఎం ప్రారంభించారు. సిఎం ప్రారంభించిన నాటి నుండి ఆర్ఒ ప్లాంట్లు దాదాపు నాలుగు, ఐదుసార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో వాటికి మరమ్మతులు చేయించకుండా వదిలేశారు. పాఠశాలలు పునఃప్రారంభం నుండి రెండు పాఠశాలల్లో ఆర్ఒ ప్లాంట్లు పని చేయకపోవడంతో విద్యార్థులు తాగునీటిని కొందరు బాటిళ్లల్లో ఇంటి నుండి తెచ్చుకుంటున్నారు. మరి కొందరు పాఠశాల సమీపంలో ఉన్న దుకాణాలు, హోటళ్ల వద్దకు వెళ్లి దప్పిక తీర్చుకుంటున్నారు. బాలికల పాఠశాలలో తరగతి గదికి వాటర్ క్యాన్ పెట్టుకొని విద్యార్థుల సొంత డబ్బులతో నీటిని తెచ్చుకుంటున్నారు. బాలుర పాఠశాలలో ట్యాంక్‌కు సంబంధించిన పైపులైన్ లీకేజి కావడంతో ట్యాంక్‌లో నీరు వృథాగా పోవడంతో మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేకుండా పోయినట్లు ఉపాధ్యాయు అంటున్నారు. లీకేజి పైపు మరమ్మతులు చేసేందుకు ఎక్కడ పైపులైన్ ఉందో అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. మోటర్ ద్వారా ట్యాంకుకు నీటిని నింపిన కొద్ది గంటలలోనే ట్యాంక్ ఖాళీ అవుతున్నట్లు వాపోతున్నారు. సమస్య అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికే వారు స్పందించడంలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. సంబంధించిన కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని పాఠశాల చైర్మన్ గురుప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో బాలుర ఉన్నత పాఠశాలలో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు దాదాపు 900 మంది, బాలికల పాఠశాలలో దాదాపు 870 మంది చదువుతున్నారు. పనులు నాసిరకంగా చేయడంతో ఆర్ఒ ప్లాంట్ ప్రతిసారి మరమ్మతులకు గురవుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత తాగునీటి కోసం బాలుర పాఠశాల విద్యార్థులు రోడ్డుపై ఉన్న దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా ఉన్న ఆర్ఒ ప్లాంట్

తాగునీటి ఇబ్బందులు తొలగించాలి

సిఎం జగన్ ప్రారంభించిన బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగడానికి నీరు కరువైంది. పెద్ద ఆర్ఒ ప్లాంట్ ఉన్నప్పటికీ ప్రయోజనంలేదు. దప్పిక తీర్చుకోవడానికి వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చెడి పోయిన ఆర్ఒ ప్లాంట్‌లను బాగు చేయించాలి.

- సల్మాన్, విద్యార్థి

మారణహోమాన్ని ఖండించండి : సిఐటియు

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దాసరి విజయ్, కోశాధికారి భాగ్యమ్మ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో నాగా, కుకి ఆదివాసిలపై జరుగుతున్న మారణహోమాన్ని ఖండించాలన్నారు. ఆ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మణిపూర్ రాష్ట్రం మూడు నెలలుగా అగ్నిగుండంగా మారడానికి కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వమే కారణమని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అధికారాన్ని దక్కించుకోవడానికి, పాలనను సుస్థిరం చేసుకోవడానికే నరమేధం చేస్తోందన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ సం ఘటనలు జరగడం అత్యంత దుర్మార్గమన్నారు. సంఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలన్నారు. మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, దివాకర్, లక్ష్మీదేవి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ వర్కర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై దాడిచేసిన వారిని ఉరితీయాలి

ప్రొద్దుటూరు : మహిళలపై దాడి చేసిన వారిని విచారణ పేరుతో కాలయాపన చేయకుండా ఉరితీయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన అమానవీయ సంఘటనకు నిరసనగా సిఐటియు సభ్యులు మంగళవారం ర్యాలీ చేశారు. సిపియం కార్యాలయం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చెన్నారెడ్డి, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు

కేంద్రం నిధులను వినియోగించలేని ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్‌ను తెచ్చుకోలేని, వినియోగించుకోలేని జగన్ ప్రభుత్వం చేతకానిదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ అనే పథకాన్ని 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పథకం కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందివ్వాలని చెప్పారు. 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు భరించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద నిధులు ఇవ్వని కారణంగా ఎపిలో ఈ పథకం అమలు కాలేదని విమర్శించారు. గుజరాత్, హరియానా, గోవా రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ పథకం ద్వారా వంద శాతం కుటుంబాలు కుళాయిల ద్వారా తాగునీటిని పొందుతున్నాయన్నారు. వెనుకబడిన రాష్ట్రంగా పేరు గాంచిన బిహార్‌లో కూడా 96.30 శాతం కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మన రాష్ట్రంలో 70.5 శాతం మేరకే కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్నట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని జగన్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం శోచనీయమన్నారు. కడప-మదనపల్లె-బెంగళూరు నూతన రైలు మార్గంతోపాటు అనేక రైల్వే ప్రాజెక్టులు జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా నిలిచిపోయినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి జల్ జీవన్ మిషన్ కింద వంద శాతం కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆయన కోరారు.

అనుమతి లేకుండా ఓట్లను తొలగించొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఓటర్ అనుమతి లేకుండా వారి ఓటు హక్కును తొలగించవద్దని జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ పార్టీ నాయకులు, విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరిగి కచ్చితంగా ఓటర్లను గుర్తించాలన్నారు. బిఎల్ఓలు స్థానిక నాయకులను లేదా ఎలక్షన్ ఏజెంట్లను వెంటబెట్టుకొని తిరగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వాలంటీర్ల సహకారం తీసుకోవద్దన్నారు. మరణించిన వారిని గుర్తించి తొలగించాలన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితోనే ఓటరు జాబితాలో సవరణ చేయాలన్నారు. ప్రతి మంగళవారం సమావేశం ఉంటుందన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

అడవి పందుల బెడద తప్పించాలని రైతుల వినతి

ఎఫ్ఆర్‌ఒకు సమస్య వివరిస్తున్న శ్రీధర్‌రెడ్డి, రైతులు

ప్రజాశక్తి - ముద్దనూరు

అడవి పందుల బెడద నుంచి పంట పొలాలను కాపాడాలని రైతులు, వైసిపి నాయకులు అటవీశాఖ అధికారులను కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఫారెస్ట్ రేంజర్ అశోక్‌కుమార్ యాదవ్, డిఆర్ఒ చంద్ర శేఖర్‌రావును కలిసి సమస్యను వివరించారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉందని రైతులు వాపోయారు. చేతికి అందిన పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పందులను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు ఎఫ్ఆర్ఒను కోరారు. ఇందుకు ఎఫ్ఆర్ఒ స్పందిస్తూ అడవి పందులు, జంతువుల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడవి పందులు, జంతువుల బారి నుండి రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు సోలార్ సిస్టం, లైటింగ్, పులి, మనిషి అరిచే అరుపు వంటి శబ్దాలు వచ్చే ఎలక్ట్రికల్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని పొలాల్లో, కంచె వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి వల్ల జంతువులకు ఎలాంటి ప్రాణ హాని ఉండదన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ పరికరాలను సబ్సిడీ ద్వారా అందిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అటవీశాఖ తరపున తగు చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఒ అన్నారు. కార్యక్రమంలో మాదన్నగారిపల్లి సర్పంచ్ జయరాం నాయిడు, వైసిపి నాయకులు శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరప్రతాప్, శివారెడ్డి, సంజీవరెడ్డి, బాలవీరయ్య, కుడాలయ్య, మల్లేష్, నాగరాజరెడ్డి, రామచంద్రారెడ్డి, ఫారెస్టు బీట్ రత్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజూ ఒంగోలు ట్రిపుల్‌ఐటిలో 426 మందికి ప్రవేశాలు

వేంపల్లె : ఆర్‌జెయుకెటిలో పరిధిలోని ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి జరిగిన రెండోరోజు మంగళవారం 426 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు డైరెక్టర్ జయరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్లు సంధ్యారాణి, జయరామిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. నాలుగు రోజులుగా జరిగిన ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ముగిసినట్లు డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. మిగిలిన సీట్లకు రెండవ విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ రాంభూపాల్‌రెడ్డి, డీన్ అకడమిక్ రత్నకుమారి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఇమ్రాన్ షరీఫ్, దినేష్‌రెడ్డి, ఒఎస్టీ గంగిరెడ్డి, అసిస్టెంట్ డీన్స్ రోజర్ బిన్ని, రాఘవరెడ్డి, కోటేశ్వరి, పిఆర్ఓ తిరుపతిరెడ్డి, లింగమూర్తి, జ్ఞానేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు 'ఉపాధి' సామాజిక తనిఖీ మండల సభ

ప్రజాశక్తి - చాపాడు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ మండల సభ గురువారం నిర్వహిస్తున్నట్లు ఎపిఒ పద్మారాణి తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో సామాజిక తనిఖీ సిబ్బంది సర్వే పూర్తి చేసి గ్రామస్థాయిలో సభలు నిర్వహణ పూర్తి చేశామన్నారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు.

శ్రీ కృష్ణ ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పనుల్లో నాణ్యత ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పనుల్లో నాణ్యత ఉండాలని కలెక్టర్ విజయ్‌రామరాజు సూచించారు. ఆ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ పనులు ఎంత శాతం జరిగాయని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ముందుగా క్రికెట్ స్టేడియం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ పనులను, ఎపి కార్లలో న్యూ టెక్ బయోసైన్స్‌ను, శిల్పారామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశులు, అధికారులు ఉన్నారు.

నియోజకవర్గంలో రూ.3378 కోట్ల పనులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నాలుగేళ్లలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పనులకుగాను రూ.3,378కోట్లు వెచ్చించామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదనడం సరికాదన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివృద్ధికి రంగులు మార్చి వైసిపి తనదిగా చెప్పుకుంటోందని వరదరాజులరెడ్డి ఇచ్చిన పత్రికా ప్రకటనకు మంగళవారం ఆయన స్పందించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివరణాత్మకంగా పత్రికల వారితో మాట్లాడారు. చేసిన అభివృద్ధి చిత్రాలను ప్రదర్శించారు.

అభివృద్ధిని చిత్రాల ద్వారా చూపుతున్న ఎమ్మెల్యే

కొనసాగుతున్న ఇంటింటి ఓటర్ల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

మండల వ్యాప్తంగా రెవిన్యూ సిబ్బంది, బిఎల్ఓల ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. బిఎల్ఓ ఓటర్ లిస్టులను తీసుకుని ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. పేర్లు, ఫొటోలు, గ్రామంలో నివాసం ఉంటున్నారా లేదా, ఇంటి చిరునామా ఇతర మార్పులు ఉంటే నమోదు చేసుకుంటున్నారు. ఇందులో టిడిపి నాయకులు కూడా పాల్గొంటున్నారు. పరిశీలనలో తహశీల్దార్ సుభాని సిబ్బందికి సూచించారు.

కేతవరంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు సర్వే

వీరభద్రస్వామి సన్నిధిలో పీఠాధిపతి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామిని హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాకుళం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పీఠాధిపతి వీరభద్రస్వామి వారి లీలా విలాసం ప్రవచనాలు బోధించారు. ప్రజలంతా సమానత్వంతో మెలగాలని ప్రబోధించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ శ్రీనివాసులు, వేదపండితులు నరేంద్ర, అర్చకులు చిన్నా, గోవిందు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎర్రగుంట్ల మండలం పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్చార్జిలతో ఇంటిగ్రేట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మీ ప్రాంతాల్లో కొత్త ఓట్లను ఎక్కించాలన్నారు. అలాగే ఫేక్ ఓట్లు నమోదు చేయించి ఉంటే, వాటిని గుర్తించాలన్నారు. మరణించిన వారి ఓట్లను తీయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, చదిపిరాళ్ళ జయరామిరెడ్డి, రాష్ట్ర నాయకులు సురేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటాం

పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామంలో హార్ట్ సర్జరీ చేసుకొని ఉన్న టిడిపి కార్యకర్త బాబా గౌస్ కుమారుడ్ని ఆయన పరామర్శించారు. సుబ్బరాయుడు, భాను కుటుంబ ఆరోగ్య పరిస్థితిని కూడా తెలుసుకొని పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, డక్కా రమేష్, జబిబుల్లా, మహమ్మద్ ఇనాయతుల్లా, పిపి చెంద్రాయుడు, టివి శ్రీనివాసులు, నాయకులు ఉన్నారు.

క్రైం కార్నర్

70 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పాండిచ్చేరి నుండి అక్రమంగా తరలిస్తున్న 70 మద్యం బాటిల్లను ఆర్పిఎఫ్ సిబ్బంది మంగళ వారం స్థానిక రైల్వేస్టేషన్లో స్వాధీనం చేసుకున్నారు. రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమి షనర్ రాజు ఆధ్వర్యంలో పలు రైళ్ళను తనిఖీ చేస్తుండగా ఎల్టిటి ముంబై ఎక్స్ప్రెస్ రైలులో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న సాయి అనే వ్యక్తి నుండి 70 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆర్పిఎఫ్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.42 వేలని తెలిపారు. మద్యం, నిందితుడిని ఎర్రగుంట్ల ఎస్ఈబి అధికారులకు అప్పచెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్పిఎఫ్ ఎస్ఐ ఖాదర్‌బాషా, సిబ్బంది ఓబుల్‌రెడ్డి, ఫిరోజి, సురేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


మద్యం, నిందితుడితో ఆర్పిఎఫ్ సిబ్బంది